

అబ్బురపరిచిన సైకత శిల్పం

రథసప్తమి శుభాకాంక్షలు తెలుపుతూ సైకత శిల్పి గేదెల హరికృష్ణ రూపొందించిన సైకత శిల్పం అబ్బురపరిచింది. సూర్యుని జయంతి సందర్భంగా తయారు చేసిన దీన్ని చూసేందుకు ప్రజలు తరలివచ్చారు.

-ప్రజాశక్తి, ఆమదాలవలస



ఆదిత్యునికి క్షీరాభిషేకం



- ప్రారంభమైన రథసప్తమి వేడుకలు
- రాత్రి 10గంటలకే క్యూలైన్‌లో బారులుతీరిన సందర్శకులు
- దేవాదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

వెలుగులరేడు సూర్యనారాయణస్వామి రథసప్తమి(జయంత్యుత్సవం) వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి 12.10 గంటలకు సుప్రభాత సేవ, ఉష:కాలార్చనతో వేడుకలు మొదలయ్యాయి. క్షీరాభిషేకం వేడుకలను కనులారా చూసేందుకు రాత్రి 10గంటల నుంచే ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లలో యాత్రికులు బారులు తీరారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా నుంచి యాత్రికులు చేరుకున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు.. దేవాదాయశాఖా ప్రాంతీయ సంయుక్త కమిషనర్, ఉత్సవ ప్రధాన అధికారి ఎం.వి.సురేష్‌బాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో తయారు చేసిన పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. స్వామివారిని శాసనసభాపతి తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, పలువురు నేతలు, అధికారులు, కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఉదయం 6గంటలకు నిజరూప దర్శనం ప్రారంభం కానుంది.

రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని దేవాలయంతో పాటు పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సంవత్సరం రూ.500లతో విఐపి పాసులను జారీ చేశారు. అందుకనుగుణంగా దేవాలయం ఆర్చి వద్ద వివిఐపి, విఐపి, క్షీరాభిషేకం క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వంద రూపాయలు, ఉచిత దర్శనం కోసం ఇంద్రపుష్కరిణి వైపు కూలైన్లు ఏర్పాటు చేశారు. ఆయా మార్గాల్లో సందర్శకులు వెళ్లి దర్శించుకున్నారు. రథసప్తమి రద్దీ దృష్ట్యా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల నుంచే అమలు చేశారు. అరసవల్లివైపు వెళ్లే వాహనాలకు మిల్లు జంక్షన్ సమీపంలోని 80 అడుగుల రోడ్డులో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద కంట్రోల్ రూమ్, సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆదిత్యుని దర్శించుకునేందుకు వేలాది మంది తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 1200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కొంత మంది సందర్శకులు ఆలయ పరిసరాల్లో వంటలు చేసుకున్నారు. మరోవైపు ఇంద్ర పుష్కరిణిలో సందర్శకులు ఎవరూ దిగకుండా పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



విద్యుత్ కాంతుల్లో అరసవల్లి ఆలయం



అరసవల్లికి ప్రత్యేక బస్సులు

సందర్శకుల సౌకర్యార్థం శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి అరసవల్లి కూడలి వరకు 20 బస్సులను నడపనుంది. గాయత్రి సిల్క్ యాజమాన్యం కాంప్లెక్స్ నుంచి అరసవల్లి కూడలి వరకు బస్సులను నడపనున్నారు.

సేవలకు స్వచ్ఛంద సంస్థలు

అరసవల్లి వచ్చే సందర్శకులకు సేవలందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. అరసవల్లి కూడలి నుంచి దేవస్థానం వైపు వెళ్లే మార్గంలో టెంట్లు వేసి పులిహోర, మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లను అందించేందుకు సిద్ధమవుతున్నారు. మున్సిపల్ అధికారులు అరసవల్లి తోట సమీపంలో మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నివాసం వద్ద సందర్శకులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతున్నారు

దర్శనం సాఫీగా సాగేలా ప్రత్యేక ఏర్పాట్లు

అరసవల్లి వచ్చే సందర్శకులకు దర్శనం సాఫీగా సాగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని దేవాదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్, ఉత్సవ ప్రధాన అధికారి ఎం.వి.సురేష్‌బాబు చెప్పారు. శుక్రవారం క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లను మరోసారి పరిశీలించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామని చెప్పారు. వికలాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయనతో పాటు ఆలయ ఇఒ హరి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

రెండు సెక్టార్లుగా బందోబస్తు : ఎస్‌పి

బందోబస్తును రెండు సెక్టార్లుగా విభజించామని ఒకటో సెక్టార్ కింద ట్రాఫిక్, రెండో సెక్టర్ కింద లా అండ్ ఆర్డర్ బందోబస్తు కేటాయించామని ఎస్‌పి జిఆర్ రాధిక చెప్పారు. శుక్రవారం ఆమె సూర్యనారాయణ స్వామి దేవాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఇంద్ర పుష్కరణి, సందర్శకులు, విఐపిలు వచ్చే మార్గాల్లో ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు సిబ్బంది షిఫ్టుల వారిగా బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు. బందోబస్తు కోసం సుమారు 1200 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని కేటాయించామని ఎస్‌పి చెప్పారు. ఆదిత్యుని దర్శనానికి వచ్చే సామాన్య సందర్శకులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్‌పి జిఆర్ రాధిక అన్నారు. ఆనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి బందోబస్తు విధుల్లో తీసుకోవాల్సిన చర్యలపై దిశ నిర్దేశాలు చేశారు. సామాన్య ప్రజల దర్శనానికి ఎటువంటి అసౌకర్యం, ఆటంకం లేకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా చూడాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లల తల్లులకు ప్రత్యేక మార్గాలు ద్వారా దర్శనానికి విడిచి పెట్టాలని చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అవసరమైన చోట సిబ్బందిని కేటాయించాలని అధికారులకు సూచించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి సందర్శకులను క్యూ పద్ధతిలో దర్శనానికి విడిచిపెట్టాలని తెలిపారు పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లోనే వాహనాలను పార్కింగ్ చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎవరికి కేటాయించిన స్థానంలో వారే ఉంటూ రిలీవ్ సిబ్బంది వచ్చినంత వరకు అక్కడ నుంచి వెళ్లొద్దని ఎస్‌పి చెప్పారు. ఆమెతో పాటు అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు, డిఎస్‌పిలు, ఆలయ ఇఒ, తదితరులు ఉన్నారు.



ఆకట్టుకున్న స్వర్ణ సూర్యుడు

రథసప్తమిని పురస్కరించుకొని కాశీబుగ్గకు చెందిన సూక్ష్మ కళాకారుడు కొల్లి రమేష్ ఆచారి తయారు చేసిన స్వర్ణ ఆదిత్యుడు ఆకట్టుకుంది. బంగారు కాంతులతో ఉదయించే సూర్యుడు, రథసప్తమి అనే తెలుగు అక్షరాలను ఒక సెంటీమీటరు ఎత్తు ఒక సెంటీమీటరు వెడల్పుతో పలుచటి బంగారు రేకుపై (0.100) మిల్లీ గ్రాముల బంగారాన్ని ఉపయోగించి రథసప్తమి లోగోను తయారు చేసి, అబ్బురపరిచాడు. దీని తయారీకి అరగంట సమయం పట్టిందని తెలిపాడు.

-ప్రజాశక్తి, పలాస

డిఆర్‌డిఎ పీడీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - జలుమూరు

స్థానిక వెలుగు కార్యాలయాన్ని డిఆర్‌డిఎ పీడీ జి.విద్యాసాగర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెలుగు కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు. సంఘాల బలోపేతానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ముందుగా కొమనాపల్లిలోని గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు వెలుగు ఎపిఎం శ్రీనివాసరావు, సిసిలు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న విద్యాసాగర్

దేశానికి మతతత్వ ముప్పు

పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిజెపి వల్ల దేశానికి మతతత్వ ముప్పు పొంచి ఉందని, కులాలు, మతాల మధ్య విబేధాలు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ధ్వజమెత్తారు. శుక్రవారం రాజీవ్‌గాంధీ జోడో యాత్ర తొలి దశ ముగింపు సందర్భంగా శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి ఇందిరా విజ్ఞాన భవన్ వరకు సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. ప్రజలకు కరపత్రాలను పంచిపెట్టారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో బిజెపియేతర ప్రభుత్వాలను ప్రజలు గెలిపిస్తే, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, ప్రత్యర్థులను పడగొట్టే నీచ సంస్కృతిని అమలు చేస్తున్నారని అన్నారు. ప్రజల విశ్వాసంపై నమ్మకంలేని మోడీ, షా ధ్వజం ఓ వైపు ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. రక్షణ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. విభజన సమయంలో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని చెప్పారు. విభజన హామీల్లో ఏ ఒక్కటీ తొమ్మిదిళ్లలో నెరవేర్చలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంతో పోరాడే సత్తా వైసిపి, టిడిపిలకు లేదన్నారు. బిజెపితో ఈ రెండు పార్టీలు అంటకాగుతున్నాయని ఆరోపించారు. ఫలితంగా రాష్ట్ర విభజన హామీలను సాధించడంలో విఫలమయ్యారన్నారు. దేశం, రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విభజన చట్టంలోని హామీ లన్నింటినీ నెరవేర్చుకోగలమన్నారు. ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త రాకేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, పేడాడ పరమేశ్వరరావు, సనపల అన్నాజీరావు, దేశెల్ల గోవింద, మల్లిబాబు, రెల్ల సురేష్, కెఎల్ఆర్ ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న గిడుగు రుద్రరాజు

రుద్రరాజును కలిసిన విభజన హామీల సాధన సమితి

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నాయకులు పిసిసి అధ్యక్షులు రుద్రరాజును నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కలిసి ఆహ్వానం తెలిపారు. అనంతపురం నుంచి ఇచ్ఛాపురం వరకు జరుగుతున్న ప్రత్యేక హోదా సమరయాత్రలో కాంగ్రెస్ పార్టీ భాగస్వాములు కావాలని కోరారు. విభజన హామీల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొలివి నర్సునాయుడు, చాపర వెంకటరమణ, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పిరియా విజయ

పారిశ్రామిక అభివృద్ధికి సెజ్

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి సెజ్ (స్పెషల్ ఎకనామిక్ జోన్) ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జెడ్‌పి చైర్‌పర్సన్ అధ్యక్షతన శుక్రవారం 2, 4, 7, 1 స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వలసల నివారణకు, ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచడానికి సెజ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధికి భరోసా ఇవ్వడానికి మంగుళూరు సెజ్ తరహాలో రణస్థలం, పైడిభీమవరం మధ్య ఐదు వేల ఎకరాల్లో సెజ్ ఏర్పాటుకు జిల్లా అనుకూలంగా ఉందన్నారు. పారిశ్రామిక వాడకు తూర్పున బంగాళాఖాతం, భావనపాడు, నౌకాశ్రయం, దక్షిణాన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పడమరన ఆరు లైన్ల జాతీయ రహదారి, రైల్వే రవాణా మార్గం అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పారిశ్రామిక వాడలో చేపట్టిన ఉత్పత్తుల ఎగుమతికి ఇవి దోహదపడతాయన్నారు. జిల్లా అధికారులు ఈ పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వ అనుమతికి పంపాలన్నారు. ఈ మేరకు స్థాయీ సంఘ సమావేశంలో తీర్మానం చేశారు. జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని, వాటిని అభివృద్ధి చేయాల్సిన అవసం ఉందన్నారు. ఒడిశా రాష్ట్రం పెద్దఎత్తున టూరిజం అభివృద్ధి చేస్తోందని, ఆయా ప్రాంతాలకు జిల్లా పర్యాటక స్థలాలు అనుసందానించడం ద్వారా పర్యాటకులను ఆకర్షించడానికి వీలుందన్నారు. జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యాన చేపడుతున్న జగనన్న కాలనీలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పరిధిలో ప్రగతి నివేదికలపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ మెటీరియల్ కాంపొనెంటు పనులపై శ్రద్ధ చూపాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో పలువురు సభ్యులు మానసిక రోగులకు, కిడ్నీ, తలసేమియా, తదితర వ్యాధిగ్రస్తులకు పెన్షన్లు తొలగింపుపై ప్రస్తావించారు. వీటిని పునరుద్ధరించాలని కోరారు. విద్యా శాఖ, సమగ్ర శిక్ష , గిరిజన సంక్షేమ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్, తదితర శాఖల ప్రగతిపై సమీక్షించారు. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్, జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పని దినాల కల్పనపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్షేత్రస్థాయిలో వంద రోజుల పని దినాలపై సిబ్బంది ప్రత్యేక దృష్టిని సాధించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి.చిటిరాజు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం శ్రీకాకుళం మండలం మోపసు బందరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సిబ్బంది గరిష్ట కూలి పొందేందుకు సమయపాలన పాటిస్తూ రెండు పూటలా పనులు చేయాలని కోరారు. చేస్తున్న పనిని మీ సొంత పనులుగా భావించాలని, నాణ్యతతో పనులు చేపట్టాలని అన్నారు. కూలీలు గరిష్ట కూలి పొందేందుకు అవసరమైన సాంకేతిక సలహాలను సిబ్బంది ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. సగటు కూలి రూ.250 రావడమే ధ్యేయంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సీతారాం, జెఇ పి.బాలముకుందబాబు, టిఎ రవి, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న చిట్టిరాజు

ఉనికి కోసమే లోకేష్ పాదయాత్ర

- ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పాలి
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ ప్రజల్లో ఉనికిని కోల్పోయిందని, అందు కోసమే నారా లోకేష్ ఈ పాదయాత్ర చేస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎవరిని మోసం చేయడానికి పాదయాత్ర ప్రారంభించారో చెప్పాలన్నారు. పాదయాత్ర చేయడం ద్వారా సిఎం జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన లాగే పాదయాత్ర చేసి సిఎం కావాలని చంద్రబాబు, లోకేష్ పగటి కలలు కనడమే అవుతుందన్నారు. 3400 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రతో జగన్ చరిత్ర సృష్టించారన్నారు. రాజధాని పేరుతో 33 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు చంద్రబాబు పన్నాగం పన్నారని, ఐదేళ్లలో ఐదు కళ్యాణ మండపాలు మాత్రమే నిర్మించి ఇదే రాజధాని అంటూ చెప్పిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. టిడిపికి దిశా నిర్దేశం లేదన్నారు. రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా పవన్ కళ్యాణ్, చంద్రబాబులో ఎవరని ప్రశ్నించారు. ఐటి మంత్రిగా ఉన్నప్పుడు ఏ పరిశ్రమ తెచ్చారో, ఎవరికి ఉద్యోగం ఇచ్చారో ప్రజలకు చెప్పాలన్నారు. జగన్మోహన్‌రెడ్డిని ఎన్నికల క్షేత్రంలో ఎదుర్కోలేకే గుంపులుగా, జోడీలు కట్టి వస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా జగన్‌వైపే ప్రజలు ఉన్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను మరింత ముందుకు తీసుకెళ్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెబుతున్నారని అన్నారు. పార్టీ లేదు.. ఏమీ లేదు అంటూ నీచంగా మాట్లాడిన అచ్చెన్నాయుడు పాదయాత్రను ప్రారంభించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గ సమస్యలపై ఎంతమేర దృష్టి సారించారో చెప్పాలని డిమాండ్ చేశారు. విజ్ఞతతో ప్రజలు ఆలోచిస్తున్నారని, తిరిగి జగన్‌ను సిఎం చేస్తారని జోస్యం చెప్పారు.



మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

సిలబస్ పూర్తి కాలేదు..

పరీక్షలు ఎలా రాస్తాం?

- నెలాఖరుతో ముగియనున్న కాంట్రాక్టు అధ్యాపకుల కాలపరిమితి
- జూనియర్ కళాశాలల్లో బోధనపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షల కాలం సమీపిస్తోంది. మార్చి 15 నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కానుండగా.. అంతకంటే ముందుగా ఫిబ్రవరి మూడో వారంలో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ విద్యా మండలి జారీ చేసిన టైమ్ టేబుల్ ప్రకారం జూనియర్ కళాశాలల విద్యార్థులకు జనవరి నెలాఖరు నాటికి సిలబస్ పూర్తి కావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలోని పలు కళాశాలల్లో సిలబస్ పూర్తి కాకపోవడంతో విద్యార్థులు పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేస్తున్న ఒప్పంద అధ్యాపకుల కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగియనుంది. గతంలో ఏటా మార్చి నెలాఖరు వరకు వీరి కాలపరిమితి ఉండేది. ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకే విధించడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పలు కళాశాలల్లో సిలబస్ పూర్తవకపోవడం.. మరోవైపు నెలాఖరుతో ఒప్పంద అధ్యాపకులు విధులకు దూరమయ్యే పరిస్థితి ఉండటంతో విద్యార్థులు పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం అయ్యే అవకాశం. లేకుండాపోతోంది. సకాలంలో సిలబస్ పూర్తయితే ఫిబ్రవరి నుంచి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. సిలబస్ పూర్తికాని కళాశాలల విద్యార్థులు ఈ పరీక్షలను సమర్థంగా రాసే పరిస్థితి లేదు.



వారే అధికం

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకులే అధికంగా ఉన్నారు. ఆయా కళాశాలల్లో ఎక్కువ శాతం మంది పేద విద్యార్థులు చదువుతున్నారు. కాల పరిమితి ముగిసిన తర్వాత విద్యార్థులు ప్రైవేటు అధ్యాపకుల ద్వారా పాఠాలు నేర్చుకోవాలంటే డబ్బులు చెల్లించుకోవాల్సి ఉంటుంది. పేద విద్యార్థులకు ఇది ఆర్థికంగా భారమవుతుంది.

విద్యార్థులు ఇబ్బందులు పడతారు

ఒప్పంద అధ్యాపకుల కాలపరిమితి నెలాఖరుతో ముగియనుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడతారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులందరూ దాదాపు పేద కుటుంబాల వారే. సిలబస్ పూర్తి కాకుండానే ఒప్పంద అధ్యాపకుల కాలపరిమితి ముగిస్తే రెగ్యులర్ అధ్యాపకులతో ఆ లోటును భర్తీ చేయడం కష్టతరమవుతుంది. ఈ దృష్ట్యా ఒప్పంద అధ్యాపకుల కాలపరిమితిని వెంటనే నవీకరించాల్సిన అవసరం ఉంది.

-జగన్మోహనరావు, ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుడు

పరిశీలనలో ఉంది



కాంట్రాక్టు అధ్యాపకుల కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగియనుండటం వాస్తవమే. వీరి నవీకరణకు సంబంధించిన దస్త్రం ప్రభుత్వం వద్ద పరిశీలనలో ఉంది. త్వరలోనే ఉత్తర్వులు వెలువడతాయి. ఈ దృష్ట్యా విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఒకవేళ నవీకరణ ప్రక్రియ ఆలస్యమైతే రెగ్యులర్ అధ్యాపకులతో విద్యార్థులకు తగిన బోధన అందేలా కార్యాచరణ అమలు చేస్తాం.

-ఎస్.తవిటినాయుడు, ఆర్ఐఒ

'చేదోడు'కు సర్వర్ గండం

రెవెన్యూ, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి- పలాస

చేదోడు పథకానికి సర్వర్ గండంగా మారింది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం లబ్ధిదారులు నిరీక్షించిన పరిస్థితి నెలకొంది. చేదోడు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సర్వర్ పనిచేయకపోవడంతో దరఖాస్తు చేసుకునేందుకు వీలు లేకుండాపోయింది. ఇది ఒక సమస్య అయితే రాష్ట్ర ప్రభుత్వం చేదోడు పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.10 వేలు నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుంది. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ప్రభుత్వం తీసుకున్న లక్ష్యానికి ఆన్‌లైన్ దరఖాస్తులకు పొంతన లేకుండా పోయింది. మండలంలోని16 సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు 169 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 119 మందికి అర్హులుగా అధికారులు గుర్తించారు. ఇంకా 25 దరఖాస్తులు ఎంపిడిఒ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. మరో 25 దరఖాస్తులు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లో పెండింగ్లో ఉన్నట్లు తెలుస్తోంది.

మూడు రోజులే గడువు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేదోడు పథకాన్ని మూడేళ్లుగా లబ్ధిదారులకు రూ.పది వేలు చొప్పున నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తుంది. అయితే ఈ నెల 24న చేదోడు పథకానికి దరఖాస్తులు చేసుకొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మూడు రోజులే గడువు ఇవ్వడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా శుక్రవారం చివరి రోజు కావడంతో సర్వర్ పూర్తిగా పనిచేయకపోవడంతో ఒక్క దరఖాస్తు ఆన్‌లైన్ జరగలేదు.

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం నిరీక్షణ

చేదోడు పథకానికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో ఏ ఒక్కటి లేకపోయినా అధికారులు అనర్హులుగా గుర్తిస్తారు. వాస్తవానికి కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుంటే 30 రోజులు, ఆదాయ ధ్రువీకరణ పత్రం కావాలంటే వారం రోజులు గడువులో రెవెన్యూ అధికారులు పరిశీలించి ఇవ్వవచ్చు. కానీ, చేదోడు పథకానికి ప్రభుత్వం కేవలం మూడు రోజులే గడువు ఇస్తే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎలా ఇస్తామని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ, సచివాలయం కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు సమయం మించిపోతుంటే... మరో వైపు సర్వర్ పూర్తిగా పనిచేయకపోవడంతో రెవెన్యూ కార్యాలయాల వద్ద దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పెరిగిపోతున్నాయి.



పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు

సిబ్బంది మూడు రోజులుగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రాత్రి పగలు తేడా లేకుండా చేద్దామన్నా సర్వర్ సహకరించడం లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఏదీ ఏమైనప్పటికీ చేదోడు పథకానికి నిజమైన లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. ఈ విషయంపై తహశీల్దార్ ఎల్.మధుసూదనరావుకు వివరణ కోరగా, సర్వర్ పనిచేయకపోవడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావడం లేదన్నారు. సర్వర్ పనిచేసిన వెంటనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని అన్నారు. ఇదే విషయాన్ని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడుకు వివరణ కోరగా, సర్వర్ పనిచేయకపోవడంతో దరఖాస్తు ఆన్‌లైన్ చేయలేకపోతున్నామని తెలిపారు. ఇదే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు.



ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

టెన్నికాయిట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పలాస

అనకాపల్లిలో ఈనెల 22 నుంచి 26 వరకూ నిర్వహించిన జాతీయ సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలబాలికల జట్టు మంచి ఫలితాలు సాధించాయి. ఇటీవల పలాసలో ఈ జట్టు శిక్షణ శిబిరంలో పాల్గొన్నాయి. శిక్షకుడిగా రాష్ట్ర టెన్నికాయిట్ సంఘ కోశాధికారి పి.తవిటయ్య వ్యవహరించారు. బాల, బాలిక విభాగాల్లో టీం ఛాంపియన్ షిప్‌లో వరుసగా రజిత, కాంస్య పతకాలను, సాధించారు. బాలికల, బాలుర డబుల్స్‌లో వరుసగా బంగారు, కాంస్య పతకాలను, మిక్స్ డ్ డబుల్స్‌లో బంగారు పతకాన్ని సాధించారు. ఈ విజయాలతో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో రన్నర్స్‌గా నిలిచారని తవిటయ్య వివరించారు. కాగా, పలాసకు చెందిన బి.సిద్ధార్థ రజిత పతకాన్ని సాధించిన టీం ఛాంపియన్ షిప్‌లో సభ్యుడిగా ఉన్నాడు. అలాగే ఈ క్రీడాకారుడు డబుల్స్‌లో చంద్రమౌళి (విజయనగరం)తో కలిసి కాంస్య పతకాన్ని సాధించాడని తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపిపి దాసు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి- సోంపేట

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు అన్నారు. మండలంలోని గొల్లఊరులో జరుగుతున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో నిర్వహించే ఇటువంటి పోటీలు క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీస్తాయన్నారు. ఆటల్లో గెలుపు, ఓటమి సహజమని, క్రీడాస్ఫూర్తి చాటాలని అన్నారు. ఈయన వెంట కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, నాయకులు పి.ఈశ్వరరావు, రేఖారావ్, బి.మాధవరావు, డి.మాధవరావు, విజయరామ్, పండు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

మిసెస్ ఇండియా పోటీలకు రజని

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



రజని

ఈ నెల 29 నుండి ఫిబ్రవరి ఒకటి వరకు రాజస్థాన్ రాష్ట్రం సిటీ ఆఫ్ టైగ్రేసెస్ రంతంపోర్ ప్రాంతంలో నిర్వహించనున్న మిసెస్ ఇండియా గ్రాండ్ ఫినాలే పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ స్కాలర్, మిసెస్ ఎవిఎన్ కళాశాల ఇంగ్లీష్ హెడ్వోడీ, శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవ) అధ్యక్షురాలు పైడి రజని హాజరుకానున్నారు. గతేడాది మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ టైటిల్ గెల్చుకున్న ఈమె రాజస్థాన్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి మిసెస్ ఇండియా పోటీలకు ఫైనలిస్ట్‌గా ఎంపికయ్యారు. ఈ పోటీల్లో వివిధ కేటగిరీల్లో ఎంపిక కావాల్సి ఉంటుందన్నారు. శాస్త్రీయ నృత్యం, ప్రాంతీయ నృత్యం, ప్రాంతీయ వంటకాలు, శాస్త్రీయ వేషధారణ, దేశంపై సామాజిక అవగాహన, సేవా కార్యక్రమాల నిర్వహణపై నాలుగు రోజులు పాటు ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో దేశంలోని 29 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొననున్నారు.

మండల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న భైరాగినాయుడు

పోలాకి : అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని పంచాయతీలను, అన్ని ప్రాదేశకాలను సమాన ప్రాధాన్యం ఇస్తూ మండల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయిడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ముందుగా తలసముద్రం ఎంపిటిసి ప్రతినిధి బావన వైకుంఠరావు మాట్లాడుతూ 130 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ పాఠశాల మూసి వేశారని, ఇది కేవలం ఎంఇఒ నిర్లక్ష్యమని ఆరోపించారు. పోలాకి సర్పంచ్ మజ్జి రమణమ్మ ప్రతినిధి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోలాకిలో బరెల్ మైదానం బాగు చేయడానికి ముందు అనుమతి ఇచ్చి... తరువాత నిలుపుదల చేశారని, దీనికి కారణాలు తెలియజేయాలని అధికారులను నిలదీశారు. ఉప ఎంపిపి కలగదండు తాతారావు మాట్లాడుతూ పంచాయతీకి రోడ్లు వేశామని, ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని పంచాయతీరాజ్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప ఎంపిపి కోట అప్పారావు మాట్లాడుతూ మండలంలోని నిధులు కేటాయించడంలో అందరికీ తెలియడం లేదని ఆరోపించారు. వెంటనే ఎంపిపి ప్రతినిధి స్పందించి మేము ఖర్చు పెట్టిన ప్రతి పైసాకు జాబితా ఉందని, అందరికీ తెలియజేస్తున్నామని, మీరు తెలుకోకపోతే మాదా తప్పు అని బదులిచ్చారు. ఇప్పటికైనా సక్రమంగా తెలుసుకోవాలన్నారు. మండల పరిషత్ నిధులు కేటాయింపుల్లోనూ, ఖర్చు చేసే విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. కోడూరు పంచాయతీలో ఉన్న ప్రభుత్వ తోట నుంచి గతంలో వేలం వేసినా ఆదాయం వచ్చేది కాదని అన్నారు. మేము వచ్చాకా ఆ పంచాయతీలో సరిచేసి కాస్త మండల పరిషత్‌కి ఆదాయ మార్గాలు వచ్చేటట్లు కృషి చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరరావు, డిటి పి.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

'యువగళం'కు తరలివెళ్లిన నాయకులు



లోకేష్‌తో నడుస్తున్న టిడిపి నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చిత్తూరు జిల్లా కుప్పంలో చేపట్టిన పాదయాత్రకు జిల్లా నుంచి టిడిపి నాయకులు తరలివెళ్లారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు, యువతకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీసేందుకు చేస్తున్న యువగళం మహాపాదయాత్రకు మద్దతు ఉంటుందని వారు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పురపాలక సంఘం పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కెవి పార్వతీశంపేట సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కె వి వెంకయ్యపేట ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమంలో భాగంగా ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పార్వతీశంపేట, రాధాకృష్ణాపురం, ప్రభుత్వాస్పత్రి, మునగవలస స్టోన్ ఫ్యాక్టరీ, పెద్దపాలెం రైస్‌మిల్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని అభివృద్ధి చేయడమే దిశగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో 14వ ఆర్థిక సాయం నిధులు రూ.11 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో పార్టీలకతీతంగా అన్ని వార్డులనూ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి సిసి రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని అన్నారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వార్డు కౌన్సిలర్ ప్రతినిధి అంబటి ఆనంద్, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు



క్షతగాత్రులను తరలిస్తున్న 108 సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని జాతీయ రహదారి జర్జంగి సమీపంలో ఉన్న గరీబుల గెడ్డవద్ద గురువారం రాత్రి 3 గంటల సమయంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి, ఐదు గొర్రెలు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... టెక్కలిలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన దేవాడ తేజేశ్వరరావు (19) తేజేశ్వరరావు తన స్నేహితులు విజయపట్నాయక్, సాయిసుమత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై మడపాంలో ఉన్న తన స్నేహితుడును కలుసుకొని తిరిగి వస్తున్నారు. ఈ సమయంలో గరీబులగెడ్డ వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న గొర్రెలను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురూ కింద పడిపోవడంతో గాయపడ్డాడు. అలాగే ఐదు గొర్రెలు మృతి చెందాయి. వెంటనే క్షతగాత్రులను 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తేజేశ్వరరావు మృతి చెందాడు. ఆ సమయంలో మంచు ఎక్కువగా కురవడంతో ఎదురుగా వస్తున్న గొర్రెలు కనిపించకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని విజయపట్నాయక్ తెలిపారు. క్షతగాత్రుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్‌ఖాదర్ బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

కొత్తూరు : మండలంలో మెట్టూరు పంచాయతీ నేరడి కూడలి వద్ద శుక్రవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. కొత్తూరుకు చెందిన కడగల సాయికుమార్ హిరమండలం అత్తవారింటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా... లారీని ఢీకొన్నాడు. ఈ రపమాదంలో సాయికుమార్ చేయి విరిగిపోయింది. వెంటనే స్థానికులు కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఈ ప్రమాదంపై హెడ్ కానిస్టేబుల్ డి.కృష్ణారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దగ్ధమైన ధాన్యం

50 బస్తాల ధాన్యం దగ్ధం

వజ్రపుకొత్తూరు : ఆరుగాలం శ్రమించిన రైతుల కష్టం అగ్నికి ఆహుతైంది. కళ్లెదుటే పొలాల్లోని ధాన్యం రాశులు కాలి బూడిదవుతుంటే ఆ రైతులు గుండెలు పగిలేలా రోధించడం విషాదాన్ని నింపింది. బెండి పంచాయతీ మహాదేవిపురానికి చెందిన రైతులు శిష్టు సారథినాయుడు, మెట్ట వాసుదేవ్, గూన బృందావనం పొలాల్లోనే నూర్పు యంత్రంతో వరి నూర్పులు చేసి రైస్ మిల్లు టోకెన్ కోసం ఎదురు చూస్తూ పొలాల్లోనే ధాన్యం ఉంచారు. గురువారం రాత్రి ధాన్యం రాశులకు మంటలు అంటుకొని ధాన్యం రాశులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు 50 బస్తాలు కాలి బూడిదైనట్లు రైతులు తెలిపారు. సమీప పొలాల్లోని వ్యవసాయ వ్యర్థాలకు నిప్పు పెట్టిన క్రమంలో మంటలు విస్తరించి ధాన్యం రాశులు కాలి బూడిదైనట్లు అనుమానం వ్యక్తమవుతుంది. సుమారు రూ.75 వేలు వరకు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా.




మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

లొద్దపుట్టిలో 'మాక్ పార్లమెంట్'

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని లొద్దపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన మాక్ పార్లమెంట్ అందరినీ ఆకట్టుకుంది. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు పి.మురళీధర్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఇందులో స్పీకర్‌గా విద్యార్థిని ప్రవల్లిక, ప్రధానమంత్రిగా మనోజ్, రైల్వే మంత్రిగా అను, వ్యవసాయ మంత్రి అజయ్, ఆర్థిక మంత్రి నిఖిత, విదేశీ వ్యవహారాలు మంత్రిగా వెన్నెల, సమాచారశాఖ మంత్రిగా రంజిత్ నిర్వహించారు. ప్రతిపక్ష సభ్యులుగా దీక్షిత, గిరిజ, ధనలక్ష్మి, యోగి, జ్యోతి, అఖిల పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుమలరావు, లక్ష్మబాయ్, హేమంతరావు, సబితా, ధర్మసాహు, సుధాకర్, వాహిని పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

ఆదిత్య విద్యార్థులు అ'ద్వితీయ'ం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

భారత 74వ గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జెఎన్‌టియుజివి 'పేట్రియాటిజమ్ అండ్ నేషనల్ బిల్డింగ్' అనే అంశంపై నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రదర్శన చేసి ద్వితీయ బహుమతిని సాధించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం తమ కళాశాల విద్యార్థులకు దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు జెఎన్‌టియుజివి రిజిస్ట్రార్ డాక్టర్ జి.స్వామినాయుడు, ఆరెన్డీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.బాబులు విద్యార్థుల ప్రదర్శనను అభినందిస్తూ జ్ఞాపికలను అందజేశారన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, పలు విభాగాల హెచ్‌చ్‌బిడిలు, సాంస్కృతిక విభాగ కన్వీనర్ డాక్టర్ సిహెచ్.రాజశేఖరరావు అభినందించారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

లఖందిడ్డిలో గడపగడపకు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అన్ని తరగతి ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లఖందిడ్డి శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని గుర్తుచేశారు.

కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వినర్లు ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్ బమ్మిడి గణపతిస్వామి, వైసిపి మండల అధ్యక్షులు నూక సత్యరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దక్క రోజా, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ పాల్గొన్నారు. అనంతరం కోటబొమ్మాళి మండల ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు వైద్యశాల వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, పశు వైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఎవరిని మోసం చేయడానికి పాదయాత్ర'




మంజు

టెక్కలి రూరల్ : యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర ఎవరిని మోసం చేస్తున్నారో చెప్పాలని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు చింతాడ మంజు ప్రశ్నించారు. టెక్కలి స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర చేయడం ద్వారా జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, అలాగే సిఎం కావాలనుకోవడం చంద్రబాబు, లోకేష్‌లు పగటి కలలు కనడమేనని విమర్శించారు. అధికారంలోకొస్తే సచివాలయ, వాలంటరీ వ్యవస్థలను రద్దు చేస్తారా? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు 2014లో ముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తే రాజధాని పేరుతో 33 వేల ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు, ఒక వర్గానికి దోచి పెట్టేందుకు పన్నాగం పన్నారని విమర్శించారు. ఐదేళ్లలో ఐదు కళ్యాణ మండపాలు మాత్రమే నిర్మించి ఇదే రాజధాని నిర్మాణాలు అంటూ చెప్పిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సిఎం అభ్యర్థిని ప్రకటించలేని అసమర్థ స్థితిలో టిడిపి ఉందన్నారు. జనసేనతో పొత్తుకు తహతహలాడుతున్న టిడిపి పవన్ కళ్యాణ్‌ను సిఎం అభ్యర్థిగా ప్రకటిస్తారా? అంటూ నిలదీశారు. ఉత్తరాంధ్ర వాసులపై మాట్లాడితే విశాఖపట్నం వస్తే తరిమి తరిమి కొడతారన్నారు.

సంక్షిప్త వార్తలు

రాణ మాజీ సర్పంచ్ మృతి



అప్పారావు (ఫైల్)

జలుమూరు: రాణ పంచాయతీ మాజీ సర్పంచ్ దుంగ అప్పారావు (63) శుక్రవారం రాత్రి ఇంటి వద్ద మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. అప్పారావు ఎంపిటిసిగా, నీటి సంఘం అధ్యక్షులుగా పదవులు నిర్వహించారు. మృతునికి భార్య జయలక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం ఇతని కోడలు ఉషా శాంతి సర్పంచ్‌గా ఉన్నారు. అప్పారావు మృతి వైసిపికి తీరని లోటు అని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మృతుడిని కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపిపి వాన గోపి, జెడ్‌పిటిసి మండ విజయశాంతి, అల్లాడ, చల్లవానిపేట పిఎసిఎస్ చైర్మన్లు పొన్నాన ముసలినాయుడు, పాగోటి రాజప్పలనాయుడు, వైసిపి మండల కన్వీనర్ కనుసు సీతారాం, వైసిపి నాయకులు మొజ్జాడ శ్యామలరావు, మెండ రాంబాబు, పైడి విఠలావు, మూకాళ్ల సత్యం ఉన్నారు.

నేడు జలుమూరు మండల సమావేశం

జలుమూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ జి.వి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి వాన గోపి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు నాయకులు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని సూచించారు. సభ్యులు నిర్దేశిత సమయానికి హాజరుకావాలని కోరారు.

ప్రజల విముక్తి కోసమే లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని, రాష్ట్ర ప్రజల విముక్తి కోసమే నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించారని మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా శుక్రవారం టిడిపి నాయకులు పాదయాత్ర చేపట్టారు. అనంతరం గౌతు లచ్చన్న, నందమూరి తారక రామారావు, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. జూనియర్ కళాశాల నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవి శంకర్ గుప్త, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, బి.నాగరాజు, ఎస్.నవీన్ పాల్గొన్నారు.

పాదయాత్రలో స్వల్ప ఉద్రిక్తత



పలాస : పాదయాత్ర చేస్తున్న టిడిపి నాయకులు

లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా టిడిపి నాయకులు చేపట్టిన పాదయాత్రలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాదయాత్రలో భాగంగా డిజె (పాటలు పెట్టేందుకు) అనుమతి లేదని కాశీబుగ్గ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మరోవైపు పోలిసులు వాగ్వాదానికి దిగారు. వాస్తవానికి పద్మనాభపురం వరకు పాదయాత్ర చేయాల్సి ఉంది. పోలీసులు అనుమతంచక పోవడంతో కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు పాదయాత్ర చేసి వెనుదిరిగారు.

టెక్కలి : లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా మండలంలోని రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయంలో టిడిపి నాయకులు పూజలు చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బగాది శేషగిరి, హనుమంతు రామకృష్ణ, ఎల్.ఎల్.నాయుడు, మట్ట పురుషోత్తం, బెహరాకాళి, రెయ్యి ప్రీతీష్‌చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, సొడిమూడి కిరణ్‌కుమార్, నర్తు కృష్ణారావు, బడే జగదీష్, పరపటి చిన్నయ్యరెడ్డి, బగాది సునీల్‌కుమార్, మణి పాల్గొన్నారు.


నందిగాం : మండలంలోని పెంటపూరులో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, మల్లా బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర్, ప్రసాదరావు, సబిజానకిరావు, ముదిలి సింహాచలం, జీరు మోహనరావు, బి.సన్యాసిరావు, ఎన్.తిరుపతిరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: లోకేష్ పాదయాత్ర విజయంతం కావాలని టిడిపి నాయకులు స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోయన రమేష్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నంబాల శ్రీను, కర్రి అప్పారావు, కోరాడ గోవింద, దేవాది సింహాద్రమ్మ, గొండు లక్ష్మణరావు, బి.రంగారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం నిర్వహించిన పాదయాత్రలో టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, దక్కత ఢిల్లీరావు, లీలారాణి, తవిటయ్య, కాళ్ల దిలీప్‌కుమార్, కాళ్ల జయదేవ్, సహదేవరెడ్డి, కామేశ్వరరావు, జిలానీ, జన్నెల సంతోష్, నాగారాజు పాత్రో పాల్గొన్నారు.

ఒక్క బియ్యం ఇస్తే ఎలా?

మెళియాపుట్టి: రేషన్ డిపోల ద్వారా ఒక్క బియ్యం తప్ప మిగతా సరుకులు సరఫరా అవడం లేదని, దీంతో ప్రజలు రేషన్ సరుకుల కోసం బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. పోడు భూములకు పట్టాలు అందడం లేదని, అధికారుల అనుమతులు లేకుండా ప్రయివేట్ వ్యక్తులు ఇష్టానుసారంగా వెంచర్లు వేస్తున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. రహదారి పనులు శంకుస్థాపనకే పరిమితం అవుతున్నాయని, కార్యరూపం దాల్చడం లేదని సభ్యులు ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారం ఏమి ఇస్తున్నారో లబ్ధిదారులకు, ప్రజాప్రతినిధులకు తెలియకుండాపోతుందని పలువురు సభ్యులు అన్నారు. అనంతరం తహశీల్దార్ పి.సరోజని, ఎఒ దాన కర్ణుడు, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ తిరుపతిపట్నాయక్ ఉత్తమ అధికారులుగా ఎంపిక కావడంతో సమావేశంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు యు.బాలరాజు, సర్పంచ్‌లు, ఎంపిటిసి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అధికారులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- టెక్కలి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవిరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్‌టిసి డిపో గ్యారేజ్ ఆవరణలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డిపో మేనేజర్ బి.ఎన్.ఎస్.మూర్తి మాట్లాడుతూ బస్సు నడిపేటప్పుడు ప్రయాణికుల సురక్షిత గమ్యం వైపు పయనించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌టిసి సిబ్బంది రామారావు, ఎఇ ఎస్.ఎం.రావు, జి.ఎన్.భూషణం, బి.ఎం.మురళి పాల్గొన్నారు.

'ఇన్నోవా క్రిస్టా' బుకింగ్ ప్రారంభం



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెం) తమ నూతన ఇన్నోవా క్రిస్టా కోసం బుకింగ్‌ను నగరంలోని పెద్దపాడు రోడ్డు ఉన్న లీల కృష్ణ టొయోటా షోరూంలో వర్చ్యువల్ సమావేశం ద్వారా శుక్రవారం ప్రారంభించామని టయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ తెలిపారు. 2005లో ఇన్నోవాను పరిచయం చేసిన నాటి నుంచి ఈ వాహనం భారతీయ మార్కెట్‌లో ఇంటి పేరుగా మారిపోయిందన్నారు. దీని సౌకర్యం, భద్రత, విశ్వసనీయత, విలాసం, శక్తిపరంగా ఇది ప్రశంసనలను పొందిందని పేర్కొన్నారు. ఈ నూతన ఇన్నోవా క్రిస్టా ఇప్పుడు వృద్ధి చేయబడిన ఫ్రంట్ ఫాసియాతో వస్తుందన్నారు. ఇటీవల విడుదల చేయగా, అసాధారణ స్పందన అందుకున్న ఇన్నోవా హైక్రాస్ (గ్యాసోలిన్, స్ట్రాంగ్ హై బ్రిడ్ ఎలక్ట్రిక్ పవర్‌ట్రైన్స్‌లో లభ్యం)ను ఇది అనుసరిస్తుందని చెప్పారు. నూతన ఇన్నోవా క్రిస్టా బుకింగ్, సరికొత్త ఇన్నోవా హైక్రాస్‌ను ఆవిష్కరణను అనుసరించారని తెలిపారు. వినియోగదారులపై టయోటా మల్టీ టెక్నాలజీ విధానానికి నిదర్శనంగా నిలుస్తూనే డీజిల్ పవర్‌ట్రైన్ కోరుకునే వారి అవసరాలను తీర్చగలిందన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



ఆమదాలవలస : స్రవంతిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం అందజేసిన అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని పిహెచ్‌సి వైద్యులు ఎం.స్రవంతి అన్నారు. మండలంలోని తొగరాం ప్రాథమిక వైద్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న స్రవంతి అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవలు ప్రజలకు అందిస్తున్న దృష్ట్యా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఆమెకు ఉత్తమ వైద్యాధికారి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సిబ్బంది ఆమెకు అభినందన సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యుడు శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ భాస్కరరావు, ఎఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

108 పైలెట్ శ్రీనివాసరావుకు...

పలాస : పలాసకు చెందిన 108 పైలెట్ కెల్లి శ్రీనివాసరావుకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డు దక్కింది. 108 సిబ్బంది పి.సత్యం, ఎన్.వెంకటరావు, బి.తారకేశ్వరరావు, ఎ.మోహనరావు, ఎం.రామచంద్రారెడ్డి, మురళీమోహన్, గోపాలకృష్ణ, గోపి, రాజేష్, శంకర్ నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఇఒకు సన్మానం

మండల రిసోర్స్ కేంద్రంలో ఎంఇఒగా పనిచేస్తున్న సి హెచ్.శ్రీనివాసరావు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న పోతనపల్లి బాలరాజుకు ప్రయివేటు పాఠశాల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ అవార్డులను కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రయివేటు పాఠశాలల సంఘం నియోజకవర్గం అధ్యక్షులు జి.రాజశేఖర్, దుర్గాప్రసాద్‌పాత్రో, సోమేష్, వెంకటరావు అభినందించారు.



పొందూరు : శ్రీనివాసరావును సన్మానిస్తున్న సునీల్‌కుమార్

ఎఎంసి సెక్రెటరీకి...

పొందూరు : పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ పి.శ్రీనివాసరావును ఉత్తమ అధికారిగా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అవార్డును ప్రదానం చేయడంపై ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎఎంసి కార్యాలయంలో శుక్రవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బెండి బాబ్జి, సిబ్బంది రాంప్రసాద్, త్రినాథరావు, జగదీష్, కృష్ణమూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.



పలాస : ఎంఇఒను సన్మానిస్తున్న రాజశేఖర్



మొక్కలు నాటుతున్న రంజిత్‌కుమార్

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట

నేచర్ సేవ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మండలంలోని యారబాడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వ్యవస్థాపక అధ్యక్షులు రంజిత్‌కుమార్ పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని, నీటిని పొదుపు చేయాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, భూషణరావు, తర్ర రామదాసు, సంఘ అధ్యక్షుడు తంగి కృష్ణ, సభ్యులు కోరుకొండ శాంతారావు, యెన్ని శ్రీధర్, సీతారాం, గోవిందరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి దువ్వాడ వాణి

నవరత్నాలపై విస్తృత ప్రచారం

టెక్కలి : జగనన్న నవరత్నాలు వంటి పథకాలపై స్వయంశక్తి సంఘాలు అవగాహన కల్పించాలని జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి ఆట్ల సరోజనమ్మ అన్నారు. మండలంలోని బొప్పాయిపురం, అయోధ్యాపురం గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లతో మరో 8 సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. అలాగే మండల పరిషత్ నిధులు ద్వారా చేపట్టబోయే అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, బగాది హరి, పొట్నూరు భూలక్ష్మి, పోలాకి సోమేశ్వరరావు, కె.కామేశ్వరరావు, ఆట్ల రవి పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న తేజేశ్వరరావు

తేజేశ్వరరావు పరామర్శ

మెళియాపుట్టి : మండలంలోని బాణాపురం పంచాయతీ సవర బాణాపురానికి చెందిన సవర మోహనరావు కుమార్తె ఉమాశ్రీ ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదానికి గురై గాయపడింది. విషయం తెలుసుకున్న విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. ఈ మేరకు ఉమాశ్రీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆ చిన్నారి వైద్య ఖర్చులు కోసం తన వంతుగా కొంత ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సరాళి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, పైల భాస్కరరావు, నాగలపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కొత్తూరు : మండలంలోని నేరడి, మాతల, సోమరాజు పురం-3 వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపిడిఒ ఎం.పావని ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పంచాయతీల పరిధిలోని 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

చిరుధాన్యాలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భారతదేశంలో చిరుధాన్యాలు తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రణాళికలను రూపొందించి చిరుధాన్యాల ఉత్పత్తి, ప్రోత్సాహకాల పెంపు తదితర అంశాలపై ఆరోగ్య నిపుణులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకారం చిరుధాన్యాలు, మిల్లెట్స్ అంటే చిన్న తృణధాన్యాల ఆహార పంటలు సముదాయం. కరువు, ఇతర వాతావరణ పరిస్థితులను తట్టుకోగలవు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు చిరుధాన్యాలు రైతులకు అనుకూలమైన పంటలు. మరీ ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించి 2023లో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. చిరుధాన్యాలను పోషక తృణ ధాన్యాలు అని పిలుస్తారు. ఎందుకంటే మానవ శరీరం సాధారణ పనితీరుకు అవసరమైన చాలా పోషకాలను అందిస్తాయి. మన పూర్వీకులు ఆహారం కోసం పెంచిన మొక్కల్లో మొట్టమొదటివి చిరుధాన్యాలే.

ముఖ్యంగా ఇవి చీడపీడలను సమర్థవంతంగా ఎదుర్కొనగలవు. జొన్న, సజ్జ, రాగి, కొర్ర, సామలు తదితరులు చిరుధాన్యాలు వరి, గోధుమల కంటే ఎక్కువ పోషక విలువలు కలిగిన పోషక పంటలు. ఇవి ఆహారంగానే కాకుండా పశుగ్రాసంగా కూడా ఉపయోగపడతాయి.



ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ చిరుధాన్యాల పంటల్లో వర్షాధారంగా, నీటి వసతి ఉన్న ప్రాంతాలకు అనువైన వంగడాలను అభివృద్ధి పరిచే దిశలో పరిశోధనలు ముమ్మరంగా చేపడుతున్నారు. రాగి, జొన్న, సజ్జ, కొర్ర వంటి చిరుధాన్యాల పంటల్లో తక్కువ కాల పరిమితి, అధిక దిగుబడి ఇచ్చే రకాలను వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రూపొందించారు.

మండలంలోని కొర్లకోట, వంజంగి, జొన్నవలస, రామచంద్రపురం, కట్యాచార్యులపేట గ్రామాల్లో 12 ఎకరాలు విస్తీర్ణంలో రాగులు పండిస్తున్నారు. ఈ ఏడాది పంట విస్తీర్ణం పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయాధికారులు ప్రణాళికలు రూపొందించారు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం

చిరు ధాన్యాలు సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. చిరు ధాన్యాల్లో ఎక్కువ మొత్తంలో పోషకాలు లభిస్తాయి. చిరుధాన్యాలు మన రోజు వారి ఆహారంలో తీసుకోవడం వల్ల మనిషికి అవసరమైన పోషకాలు అందుతాయి, బిపి, సుగర్ అదుపులో ఉంటుంది. అసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యలు దరి చేరకుండా ఉంటుంది. **- మెట్ట మోహనరావు, ఎఒ**



వంట కార్మికులతో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ

ఇచ్ఛాపురం: విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి పెట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి సూచించారు. పురపాలక బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ మేరకు విద్యార్థినిలకు మెనూ ప్రకారం అందిస్తున్న జగనన్న గోరుముద్దను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. జగనన్న గోరుముద్ద ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు గగన కుమారితో మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే... కమిషనర్‌తో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నల్లి రమేష్, 9 వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్ పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

హెల్మెట్ల తప్పనిసరిగా వినియోగించాలని టాఫిక్ ఎస్ఐ జె.రామారావు అన్నారు. నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినప్పుడు ఎక్కువగా తలకు దెబ్బలు తగిలి చనిపోతారని, అదే హెల్మెట్ ఉంటే తలకు దెబ్బలు తగలడం తక్కువ అని అన్నారు. అందువల్ల ప్రమాదం నుంచి కాపాడుకోవచ్చునన్నారు. ప్రాణం ఎంత విలువైందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు పూర్తిస్థాయి ట్రాఫిక్ నిబంధన పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ పి.రామారావు, కానిస్టేబుల్ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామారావు

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

జె.ఆర్.పురం సిఐ ఆదాం

రణస్థలం: జె.ఆర్.పురం సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సిఐ ఎస్.ఆదాం పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రలు, దొంగతనాల అదుపు, కోడిపందేలు, పేకాట శిబిరాలు తదితరాలను నియంత్రించడంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన కూడళ్లయిన కోష్ట, పైడిభీమవరం, కమ్మసిగడాం తదితర ప్రాంతాల్లో వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశ్రామికవాడ పైడిభీమవరం సిస్కో పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులు ఉన్నారని, వీరంతా ఆ ప్రాంతంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా అందుబాటులో ఉంటారని, ప్రజలకు అవసరమైనా తనను సంప్రదించాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

సర్కిల్ పరిధిలో జాతీయ రహదారి అధికంగా ఉన్నందున సంక్రాంతికి వాహనాలపై రాకపోకలు సాగించేవారు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం అధిక లోడుతో ప్రయాణించకూడదని తెలిపారు. రామతీర్థాలు కూడలి, పెట్రోలు బంకు, యుబి పరిశ్రమ వద్ద దృష్టి సారించాలని సిబ్బంది సూచించామని పేర్కొన్నారు. రామతీర్థాలు రహదారి, గ్రామీణ మార్గాల్లో ప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టనున్నామని చెప్పారు. మద్యం తాగి, అధిక వేగంతో ప్రయాణించే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఎస్.ఆదాం

దాబాలు, జాతీయ రహదారి పొడవునా బహిరంగంగా మద్యంగా తాగినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తీర ప్రాంతాలు, ఇతర చోట్ల నాటు సారా, అక్రమ మద్యం విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

నిరంతరం సర్కిల్ పరిధిలో ఇప్పటికే 102 మందిపై రౌడీషీట్లను గుర్తించామన్నారు. గ్రామాల్లో ఎవరైనా తగాదాలకు పాల్పడినా, వివాదాలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.